వ్యాస కౌముది



# ఇది ఇంకో తాజ్‌మహల్

– గొల్లపూడి మారుతీరావు

ప్రపంచ అద్భుతాల్లో ఒకటయిన తాజ్‌మహల్ ప్రపంచ అద్భుతమయిన కారణంగా తెలియనివారుండరు. ఈ మధ్య ముంబైలో జరిగిన ఘాతుకం కారణంగా ముంబై ‘తాజ్‌మహల్‘ హోటల్ గురించి తెలియనివాళ్ళుండరు. పాపులారిటీ సమదర్శి. ప్రహ్లాదుడనే పరమ దైవ భక్తుడి కథలోనే మనకు హిరణ్య కశిపుడనే పరమదైవ ద్వేషి కూడా దర్శనమిస్తాడు. అలాంటి కథే ఈ ‘తాజ్‌మహల్‘ - ఆగ్రా గురించి కాదు నేను చెప్పేది. ముంబై గురించి.

ఆ మధ్య ఇస్లామాబాద్‌లో జరిగిన మారియట్ హోటల్ కూలినట్టు, 9 /11 న న్యూయార్కులో వరల్డ్ ట్రేడ్ సెంటర్ కూలినట్టు - ఇండియాలో - ఆర్థికాభ్యుదయానికి చిహ్నమయిన ముంబైలో తాజ్‌హోటల్‌ని కూల్చడం దౌర్జన్యకారుల లక్ష్యం. ”నా కన్ను పోతే నీ కన్నూ పోగొడతా”ననడం నీచత్వానికి ఆఖరిమెట్టు. కుసంస్కారి మనస్థత్వానికి మొదటి గుర్తు. ఇంతకన్న గొప్పతనాన్ని మనం దౌర్జన్యకారుల నుంచి ఆశించడం అన్యాయం. ఈ విషయాన్ని పట్టుబడిన దౌర్జన్యకారుడు కసాబ్ వెల్లడించాడు. అయితే వరల్డ్ ట్రేడ్ సెంటర్ కూలింది. మారియట్ కూలింది. ఊహించలేనంత తొందరగా రక్షణ దళాలు అడ్డుపడిన కారణంగా హోటల్ కూలలేదు. దౌర్జన్యకారుల ‘లక్ష్యం‘ కూలింది. ఎందరో ప్రాణాలర్పించిన అమర వీరుల త్యాగాలకు దర్పణమయి తాజ్‌మహల్ హోటల్ ఇంకా నిలిచే ఉంది. ఈ దుశ్చర్యకు దయనీయమైన రాజకీయ నాయకత్వపు అలసత్వం కారణమైతే, దీని నివారణకు మొక్కవోని రక్షణ దళాల త్యాగనిరతి కారణం.



అయితే 105 సంవత్సరాల తాజ్‌మహల్ చరిత్ర చాలామందికి తెలియదు. ఒక షాజ్‌హాన్ తన ప్రియురాలి పట్ల ప్రేమకి చిహ్నంగా ఒక తాజ్ మహల్‌ని నిర్మిస్తే, దక్షతగల ఒక పారిశ్రామికవేత్త, ఒక స్వాప్నికుడు జమ్‌షెడ్జీ టాటా బొంబాయి పట్ల తన ప్రేమకి చిహ్నంగా ఈ ‘తాజ్‌మహల్‘ని నిర్మించాడు. (ఈ మధ్య బంగ్లా దేశ్‌లో అషనుల్లా మోనీ అనే ఓ సినీ నిర్మాత ఆగ్రా తాజ్‌మహల్ మీద మోజు తీరక - సినిమా నిర్మించడానికి బదులు ఓ తాజ్‌మహల్‌ని బంగ్లాదేశ్‌లో నిర్మించాడు. ”షాజ్‌హాన్ తన భార్యమీద ప్రేమకి

చిహ్నంగా ఆ తాజ్‌మహల్‌ని నిర్మించాడు. నేను షాజ్‌హాన్ మీద ప్రేమకి గుర్తుగా నిర్మిస్తున్నాను" అన్నాడాయన 580 లక్షల డాలర్ల ఖర్చుతో ఈ నిర్మాణం ఇంకా సాగుతోంది.)

దక్షిణాఫ్రికాలో ఓ అర్థరాత్రి పీటర్ మారిట్స్ బర్గ్ స్టేషన్‌లో ఒక నల్ల మనిషిని (మహాత్మా గాంధీని) మెడబట్టుకుని తెల్లదొర బయటికి తోశాడు. అది ఒక దేశపు స్వాతంత్ర్య ఉద్యమానికి పునాది అయింది. ఆ రోజుల్లో ఇండియాలో తెల్లవారికి ప్రత్యేకంగా క్లబ్బులుండేవి. వాటిలో నల్లవారికి ప్రవేశం లేదు. 1895 లో బొంబాయిలో ఉండే అప్పటి ప్రముఖమయిన వాట్సన్ హోటలు ఆంక్ష అది. ఆ హోటలు లోకి జమ్‌షెడ్జీ టాటా వెళ్ళడానికి అంగీకరించలేదు. ఆయన పౌరుషంతో, జాతీయాభిమానంతో అప్పటికప్పుడు ఓ నిర్ణయం తీసుకున్నాడు. 'నేను ఓ హోటల్ నిర్మిస్తాను" అనుకున్నాడు.



మొదట జమ్‌షెడ్జీ టాటా గురించి చెప్పుకోవాలి. పరిశ్రమ పేరిట దేశాన్నీ, సమాజాన్నీ - వెరసి - ప్రజలనీ దోచుకునే అవకాశవాదులయిన పారిశ్రామిక వేత్తల 'దోపిడీ'ని అనునిత్యం చూస్తున్న మనకి జమ్‌షెడ్జీ టాటా వంటి వైతాళికులు చాలా విచిత్రంగా కనిపిస్తారు. ఈ దేశాన్ని అభివృద్ధి పథంలో నిలపడానికి ఏం అవసరమో యోచించి, ఆ కృషిని చేసి, సాధించి - ఆ పురోగతిలో తన వాటాని తీసుకుని, వచిన లాభాన్ని సాటివారికి పంచే అరుదైన పారిశ్రామిక వేత్త. (ఇప్పటికీ టాటా ఆదాయంలో 65 శాతం ట్రస్టులలో, ఇతర ధార్మికమైన పథకాలలో ఉంది) దాదాపు 150 ఏళ్ళక్రితం ఈ దేశపురోగతికి 'ఉక్కు' అవసరాన్ని గ్రహించి - ఈ దేశంలో ఉక్కు పరిశ్రమని స్థాపించిన ఘనత టాటాది. హుకుంపూర్ అనే చిన్న గ్రామాన్ని ఒక మోడల్ పట్టణంగా - జమ్‌షెడ్ పూర్‌గా మలిచిన ద్రష్ట టాటా. అలాగే శాస్త్రీయమైన పరిశోధనలకు, పై చదువులకి, ధార్మిక కార్యకలాపాలకు, ఆరోగ్య పరిరక్షణకు - అన్నిటికీ తమ ఆదాయంలో 65 శాతాన్ని ట్రస్టుల ద్వారా కేటాయించిన వట వృక్షం - టాటా.

పరిశ్రమలు ఉన్నచోట కార్మికులు, కార్మికులు ఉన్నచోట యూనియన్లు, యూనియన్లు ఉన్నచోట రాజకీయాలు, సమ్మెలు, హత్యలు, తగాదాలు - ఇవన్నీ మామూలు. వీటికేనాడూ తావివ్వకుండా సిబ్బందిని తమంతో పెంచుకుని నడిచిన కార్యదక్షత ఆ సంస్థది.

## ప్రారంభం

1880 - 90 ప్రాంతాల్లో ముంబైలో ఇప్పుడు కనిపిస్తున్న పెద్ద పెద్ద కట్టడాల నిర్మాణం జరిగింది. ఇప్పటికీ ముంబై వచ్చిన ప్రేక్షకులు విధిగా దర్శించే స్థలం - విక్టోరియా టెర్మినస్, మునిసిపల్ కార్పోరేషన్ భవనం, ప్రస్తుత పశ్చిమ రైల్వే భవనాలు. ప్రాంతీయ దురభిమానంతో బొంబాయిని ముంబైగా, విక్టోరియా టెర్మినస్‌ను శివాజీ టెర్మినస్‌గా మార్చి, ప్రజలను దువ్వే రాజకీయ నాయకత్వం అప్పటికింకా రాలేదు. తాజ్‌మహల్ హోటలు - ఓ సంస్థ సొంత భవనం అయింది కాని - కాకపోతే దానికి బాలథాకరేగారి భార్య పేరో, రాజ్ థాకరేగారి అమ్మమ్మ పేరో పెట్టేవారు! కాలగమనంలో నిలిచి, చరిత్రలో భాగమయిన కొన్ని మైలురాళ్ళని కదపడం ప్రాంతీయాభిమానం అనిపించుకోదు. 'కుసంస్కారం' అనిపించుకుంటుంది. ఇంగ్లండులో వేల్స్‌లో అలివర్ క్రోంవెల్ కాలంలో రాజద్రోహులను ఉరి తీసిన స్థలం, ఆ కొయ్యదూలంతో పాటు ఇప్పటికీ ఉంచారు. అక్కడ 'జ్రాడ్ ఇన్' అనే హోటల్ నడుస్తోంది. నేనా స్థలాన్ని చూశాను. అది చరిత్ర. దాన్ని వక్రించడం జాతికి అన్యాయం చెయ్యడం. మౌంట్ రోడ్ అన్నాశాలైగా, ట్రిప్లికేన్ తిరువళ్ళిక్కేణిగా, బరోడా వదోదరాగా మారడం ఇలాంటివే. సరే. ఈ జబ్బుకి మూలాలు వెదకడానికి ఇది సమయం కాదు. ఇక విషయానికి వస్తే ఆ రోజుల్లో బొంబాయిలో చెప్పుకో దగ్గ హోటలు లేదు.

అపోలో బందర్‌కి దగ్గరలో ఉన్న యాక్ట్ క్లబ్బు దగ్గర సముద్ర చొచ్చుకు వచ్చిన చోట చిన్న చిన్న పడవలు నడిచేవి. ఆ స్థలాన్ని అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం మట్టితో నింపి భూభాగంగా మారుస్తోంది. అక్కడ 1898 నవంబరు 1 న రెండున్నర ఎకరాల స్థలాన్ని జమ్‌షెడ్జీ

టాటా 99 సంవత్సరాల లీజుకి తీసుకున్నారు. టాటా కంపెనీల డబ్బుతో కాదు (అప్పటికి హోటల్ వ్యాపారానికీ టాటా కంపెనీలకీ సంబంధం లేదు కనక ) తన సొంత డబ్బుతో తీసుకున్నారు - కొడుకులు, వాటాదారుల ప్రమేయం లేకుండా.

శంకుస్థాపన, భూమి పూజ ఏమీ లేదు. కొబ్బరికాయ కొట్టలేదు. ప్రస్తుతం ఉన్న స్విమ్మింగ్ పూల్, లిఫ్టుల మధ్యలో పార్శీ సంప్రదాయంలో దీపం వెలిగించారు. అదీ ఓ బృహతర ప్రణాళికకి కార్యరూపం.

సీతారాం ఖండేరావ్ వైద్య, డి.ఎన్. మీర్జా అనే ఇద్దరు ఆర్కిటెక్కులు ఈ హోటల్ ప్రాథమిక రూపాన్ని సిద్ధం చేశారు. తర్వాత డబ్ల్యు ఏ. ఛాంబర్స్ అనే ఇంగ్లీషు ఇంజినీరు ఈ హోటల్ నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఈ నిర్మాణాన్ని గురించి వింత వింత కథలున్నాయి. ఇటలీ, ఫ్రెంచి ఆర్కిటెక్ట్ ఈ తాజ్‌ని కాగితం మీద రూపొందించాడనీ, తీరా ఆయన తన దేశానికి వెళ్ళి తిరిగి వచ్చేసరికి - ఇటునుంచి అటు తిప్పి (సింహద్వారం భూభాగం వేపు, వెనక భాగం సముద్రానికి అభిముఖంగా) కట్టడాన్ని చూసి ఆయనకి గుండె పగిలిందనీ - ఆ మనస్థాపాన్ని తట్టుకోలేక తాజ్‌మహల్ హోటల్ మీద నుంచీ దూకి ఆత్మ హత్య చేసుకున్నాడనీ చెప్పుకోడానికి వింతగా, సినిమా కథలాగ ఉందే కాని ఇది నిజం కాదు.



ఆ రోజుల్లో - సముద్రాన్ని ఆనుకుని ఇంకా 'గేట్‌వే ఆఫ్ ఇండియా' నిర్మాణం కాలేదు. దాన్ని 1924 లో కట్టారు. అప్పటికి 13 సంవత్సరాల క్రితం అయిదవ జార్జి చక్రవర్తి, మేరీ రాణీ ఇండియా వచ్చినప్పుడు ఇక్కడ ఓడ దిగారు. ఇండియాకి వచ్చిన (అప్పటికి) ఒకే ఒక్క చక్రవర్తి జార్జి. ఆ సంఘటనకి గుర్తుగా గేట్‌వే ఆఫ్ ఇండియాని నిర్మించారు. అంతకుముందు - సంపన్నులు, మోతుబరులు - అక్కడ సముద్రం ముందు బల్లలు వేసుకుని కులాసాగా హుక్కా పీలుస్తూ, మద్యాన్ని సేవిస్తూ ఉండేవారట. న్యాయంగా ఇంత గొప్ప హోటల్ సముద్రానికి అభిముఖంగా ఉండాలి కదా? కాని ఆర్కిటెక్టులూ, జమ్‌షెడ్జీ గారూ అటునుంచి ఇటు ఉండాలని భావించారు. ఇద్దరికీ రెండు కారణాలున్నాయి. ఇప్పటి తాజ్ వెనుక భాగం (అప్పటి సింహద్వారం) ఎదురుగా వెల్లింగ్టన్ మ్యూస్ అనే గుర్రపు శాలలు ఉండేవి. జమ్‌షెడ్జీ ఆ స్థలాన్ని కొన్నాడు. హోటల్‌కి వచ్చే అతిథుల గుర్రాలు, గుర్రపు బగ్గీలు అక్కడ నిలుపుకునేవారు. అప్పటి వాహనాలు గుర్రాలే. కనక బండి దిగి హోటల్ లోకి వెళ్ళేవారికి అటు ముఖద్వారం ఉండడం మంచి సౌకర్యం. అయితే అప్పటి చక్రవర్తిని 'అపహాస్యం' చెయ్యడానికి (తనని ఆ సంప్రదాయం అవమానించింది కనక) సముద్రానికి హోటల్ 'వీపు' చూపాడని అంటారు. హోటల్ నిర్మాణంలో ఉండగా ప్రతీ రోజూ జమ్‌షెడ్జీ ఆ స్థలానికి వచ్చేవారట. ఆ స్థలానికి ఎదురుగా కస్టమ్స్ షెడ్లు ఉండేవి. ఆ షెడ్ల నీడలో ఆయన కూర్చునేవారట. అప్పటి కస్టమ్స్‌లో గోవా ఆఫీసరు ఫ్రాన్సిస్ క్జేవియర్ డిమెల్లో పని చేసేవాడు. ఆయన కూతురు -బహుశ జమ్‌షెడ్జీతో మాట్లాడేదనుకుంటాను - ఆవిడ చెప్పిన విషయం - హోటల్లో ఉండే ప్రతీ అతిథికీ సముద్రదృశ్యం కనిపించడం, ఆ గాలి వాటంలో గదులు ఉండడం మరో కారణం.

ఆ రోజుల్లో ఎయిర్ కండిషన్ లేదు. నిజానికి కరెంటూ లేదు. కొలాబా తీరంలో సముద్రతీరం నుంచి వచ్చే చల్లని గాలులు - హోటల్ గదుల్ని తాకేలాగ భవనాన్ని వలయాకారంలో నిర్మించారు. ఆ రోజుల్లో ఇంత ఖరీదయిన హోటల్‌కి వచ్చేవారిలో ఎక్కువమంది విదేశీయులే. వారికి చల్లదనం అవసరం. అందుకని ఎత్తయిన గదులు, గాలి విశృంఖలంగా పచార్లు చేసే వరండాలు నిర్మించారు. మొదట్లో అయిదే అంతస్తులుండేవి. హోటల్ సిబ్బందికాక 50 మంది ఉండడానికి వసతులు కల్పించారు. నేల మీద ఉండే అంతస్తులో ఆహారాన్ని, ఇతర వస్తువులు 'తాజా'గా ఉంచడానికి ఆ రోజుల్లోనే రిఫ్రిజిరేషన్ ఏర్పాటు చేశారు. ఇవన్నీ కరెంటు లేకుండా ఎలా సాధ్యమని

సందేహం వస్తుంది. జమ్‌షెడ్జీ స్వయంగా జర్మనీ వెళ్ళి డస్సె, డోర్ఫ్‌లో హైడ్రో ఎలక్ట్రిక్ యంత్రాల్ని కొని తీసుకువచ్చారు. హోటల్ పూర్తయాక - ఒక్కసారి భవనమంతా మిరుమిట్లు గొలిపేలాగ విద్యుద్దీపాలు వెలిగేసరికి అక్కడ ఉన్నవాళ్ళంతా సంభ్రమాశ్చర్యాలతో చప్పట్లు కొట్టి హాహాకారాలు చేశారట!

ఇక రెస్టారెంట్లు, షాపులు, అద్భుతమైన భోజనాల హాలు, చేతితో నేసిన తివాచీలు, రీడింగ్ రూం, బిలియర్డ్స్ ఆడే హాలు ఏర్పరిచారు. పెద్ద పెద్ద 'సూట్స్' నిర్మించారు. అన్ని గదుల్లో (గత శతాబ్దపు తొలిరోజులు - జమ్‌షెడ్జీ దూరదృష్టికి ఇంతకన్న గొప్ప ఉదాహరణ లేదు!) ఎలక్ట్రిక్ దీపాలు, పంపకాలు ఏర్పాటు చేశారు. లిఫ్టులు అమర్చారు. పెద్ద టర్కిష్ స్నానాల హాలుని ఏర్పాటు చేశారు. ఈ హోటల్‌లో 2000 మంది చొప్పున 18 బృందాలు వేర్వేరుగా పార్టీలు చేసుకునే ఏర్పాట్లు చేశారు.



జమ్‌షెడ్జీ స్వయంగా బెర్లిన్ నుంచి షాండలీర్లు తెచ్చారు. హోటల్లో సోడా తయారుచేసే యంత్రాన్ని ఏర్పాటు చేశారు. అమెరికా నుంచి బట్టలు చలవ చేసే ఎలక్ట్రిక్ సాధనాలు, పంకాలు దిగుమతి అయాయి. ఆ రోజుల్లో పారిస్‌లో ఐఫిల్ టవర్ పెద్ద వింత. తర్వాత అది ప్రపంచ అద్భుతాలలో ఒకటుంది. ఆ టవర్ నిర్మాణంలో వాడిన 'ఉక్కు' స్థంబాలను జమ్‌షెడ్జీ దిగుమతి చేయించారు! అప్పటికి ఆ హోటల్ ఖరీదు 25 లక్షల రూపాయలు. (ఆ కుటుంబానికి చెందిన రూసీ ఎమ్. లాలా ఈ విషయాన్ని పేర్కొన్నారు.) ఇవన్నీ చాలన్నట్లు బొంబాయికి సమీపంలో ఉన్న పాంజూ, దోంగ్రీ అనే రెండు చిన్న దీవుల్ని బేరం చేశారు జమ్‌షెడ్జీ - హోటల్లో దిగిన అతిథులు విహారాలకు వెళ్ళడానికి అనువుగా.

ఏ నిర్మాణమయినా పూర్తికాకముందే - ఇంకా నిర్మాణం సాగుతుండగానే గృహప్రవేశం చెయ్యడం సంప్రదాయం. అప్పటికి హోటల్‌లో ఒక పక్క భాగం, హోటల్ శిఖరం (డోమ్) పూర్తయింది. అప్పటికి జమ్‌షెడ్జీ ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తోంది. ఆయన ఉండగానే ఆయన బొంబాయి నగరానికి మనసారా ఇచ్చే 'బహుమతి'ని కళ్ళారా చూసుకునే వీలుంటుందని కొడుకులూ, అనుచరులూ గృహప్రవేశ ముహూర్తాన్ని ముందుకు జరిపారు. 1903 డిసెంబరు 16 ముహూర్తం. వేడుక అనుకున్నట్టూ సాగిపోయింది. మరో అయిదు నెలలకి జమ్‌షెడ్జీ కన్నుమూశారు.

ఆయన పోయాక పారిస్ నుంచీ ఉక్కు, మిగతా హైడ్రో ఎలక్ట్రిక్ సామగ్రీ దిగాయి. పని కొనసాగింది. ఓ దేశభక్తుడూ, పారిశ్రామిక వేత్త స్వప్నానికి ఆయన పోయాక తుదిమెరుగులు దిద్దారు.

సంవత్సరాల తర్వాత - 1971 -72 ప్రాంతాలలో ఈ హోటలు స్ఫూర్తితో జైపూర్‌లో రాంబాగ్ పాలెస్ రూపు దిద్దుకుంది. ఒక హోటల్ ఒక మహరాజు పాలెస్‌కి స్ఫూర్తికావడం ఎంత విశేషం!

ఇక తాజ్ మహల్ హోటల్‌లో ఉన్న ప్రముఖుల పేర్లు వ్రాయాలంటే ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తుల జాబితాను తయారు చేసినట్టే. చక్రవర్తులు, మహారాజులు, దేశాల అధ్యక్షులు, వ్యాపార సంస్థల అధిపతులు, ప్రపంచ స్థాయి సినీతారలు, క్రీడాకారులు, కళాకారులు - ఒకరేమిటి? ఈ హోటల్‌లో మకాం చేయడం ఒక స్టేటస్ సింబల్. సోమర్సెట్ మాఘం, కెంట్ రాజు, రాణీ; జోన్ కాలిన్స్, నార్వే రాజు, రాణి; ఎడింబరో డ్యూక్, ప్రిన్స్ ఆఫ్ వేల్స్ బీటిల్స్, బిల్ క్లింటన్, జాక్విలిన్ కెనడీ ఒనాసిస్, బ్రాడ్‌పిట్, ఏంజెలినా జోలీ - ఈ జాబితా ఆశ్చర్యకరం, అనంతం.

ఈ హోటల్ అవతరించిన 20 ఏళ్ళ తర్వాత గేట్ వే ఆఫ్ ఇండియా నిర్మితమయింది. అందుకని ఇండియా చేరే ఓడలకి - భారత దేశపు అభిజ్ఞగా ఈ తాజ్‌మహల్ హోటలే కళ్ళబడేది. తర్వాత గేట్‌వే ఆఫ్ ఇండియా వచ్చినా - దాని వెనుక గంభీరంగా నిలిచిన తాజ్‌హోటలే తన తర్వాతి తరాన్ని అంగీకరించే పెద్దమనిషిలాగ ఇప్పటికీ విదేశీనావికులని ఆహ్వానిస్తూంటుంది.

కాలం గడిచాక - ప్రాచుర్యం, అవసరాల దృష్ట్యా - హోటల్ ముఖద్వారాన్ని సముద్రానికి అభిముఖంగా మార్చారు. అయితే వీపుకి కళ్ళు అమర్చినట్లు కాస్త విడ్డూరంగా ఉన్నా ఇప్పటి తరానికి ఈ విడ్డూరమే చరిత్ర అయి కూర్చుంది.

1970 లో హోటల్ పరపతి, అవసరాల దృష్ట్యా టవర్ బ్లాకుని నిర్మించారు. మెల్విన్ బెకర్ అనే అమెరికన్ ఆర్కిటెక్ట్ ఈ భవన స్వరూపాన్ని నిర్దేశించాడు. డేల్ కెల్లర్ అనే ఆర్కిటెక్ట్ ఉదయపూర్ సంప్రదాయంలో, ఇండియన్ రెస్టారెంటుని తంజావూరు స్థూపాల రమణీయకతతో రూపొందించారు.

భారతదేశాన్ని సందర్శించడానికి వచ్చిన ప్రతి పర్యాటకుడి కల ఆగ్రాలో తాజ్‌మహల్‌ని చూడడం, బొంబాయి తాజ్‌మహల్ హోటల్లో ఒక రాత్రి గడపడం.



అయితే నవంబరు 26, 2008న ఆ కల కొందరికి పీడకల అయింది. ఆహ్లాదంగా, యధాలాపంగా ఫలహారాలు సేవిస్తూ కబుర్లు చెప్పుకుంటున్న 172 మందిని దౌర్జన్యకారులు కాల్చి చంపారు. ఈ మారణహోమంలో 293 మంది గాయపడ్డారు. 62 గంటల సేపు జరిగిన ఈ హింసాకాండ శతాబ్దపు తాజ్ చరిత్రను గాయపరచింది. అయితే నిన్నకాక మొన్న నిర్మించిన మారియట్‌లాగో, వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లాగో తాజ్ కుప్పకూలలేదు. సంప్రదాయ వైభవం, ఆనాటి రాతి కట్టడాన్ని యధాతథంగా - ఈ జాతి ధర్మంలాగే చెక్కుచెదరకుండా నిలిపింది. జాతి గర్వించే ఓ చరిత్ర, దౌర్జన్యకారుల ప్రయత్న వైఫల్యం వల్ల - మరో కారణానికి 'కొత్త చరిత్ర'గా అచిరకాలంలో మోర ఎత్తి నిలిచింది..

ఆగ్రా తాజ్ మహల్‌ని సాహిత్యంలో మహాకవి జాషువా అజరామరం చేశారు. ఆయన వాక్కు ఇది:

ఒక్కొక్క రాతిలో నిమిడి యున్నవి నేటికి, షాజహాను భూ
భృక్కునెడందలో నుడికిపోయిన నాడులలోని రక్తపుంజుక్కలు....

బొంబాయిలో తాజ్‌మహల్ గురించి జాషువా గొంతు విప్పితే ఇలా అనేవాడేమో:

ఒక్కొక్క రాతిలో నిమిడి యున్నవి నేటికి, టెర్రరిస్టు బలి రక్కసి మూక దాడులకు రాలిన యోధుల వేడి రక్తపుంజుక్కలు.......

ఏమయినా చరిత్ర మహాకవి వాక్కులో చరితార్థమౌతుంది. మరో జాషువా కోసం ఎదురుచూడడంలో తాజ్‌మహల్ (అవును, ముంబైలోనిదే) అలిసిపోదు. ఆశవదులుకోదు.